క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీరాల అర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణంలోని జయంతిపేట, మరియమ్మపేట, ఐక్యనగర్, ఉజిలిపేట ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ హరిప్రసాదరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

అద్దంకి: శింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన రాతి ముఖ మంటప నిర్మాణానికి దేవస్థానం తరఫున విరాళాలు సేకరిస్తున్నారు. దానిలో భాగంగా గురువారం పట్టణానికి చెందిన వూటుకూరు నాగయ్య, వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి మనవళ్లు వూటుకూరు నరేంద్ర, కృష్ణకిషోర్ రూ.1,11,116 ఏసీ తిమ్మనాయుడికి అందజేశారు.

గ్రంథాలయానికి క్రీడా వస్తువుల వితరణ

చీరాల అర్బన్: చీరాల పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి దాతలు క్రీడా వస్తువులను గురువారం అందించారు. శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్న సందర్భంగా పాల్గొనే చిన్నారులకు ఉపయోగించేందుకు రూ.5వేలు విలువ చేసే వివిధ రకాల ఆట వస్తువులను పల్లపోతు బాల సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ఆయన కుమారులు రాధాకృష్ణమూర్తి, శ్యాంప్రసాద్‌లు గ్రంథపాలకురాలు డి.ధనమ్మకు అందించారు. దాతలకు గ్రంథపాలకురాలు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడు సుబ్బయ్య

అద్దంకి: ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో నడుపుతున్న వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కలవకూరు సమీపంలోని చెరువు వద్ద గురువారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన సుబ్బయ్య ట్రాక్టరు తీసుకుని కలవకూరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చెరువు సమీపంలోనికి రాగానే ఎదురుగా వస్తున్న మోటారు బైకులను తప్పించబోయి రోడ్డు సైడులో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో నడుపుతున్న సుబ్బయ్య విసిరేసినట్లు రోడ్డు సైడులో పడటంతో పెద్ద ప్రమాదం తప్పి తీవ్ర గాయాలు కాగా స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. తరువాత బంధువులు మెరుగైన చికిత్స కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం చైత్ర మాసం పూర్వాబాద్ర నక్షత్రం ద్వాదశి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఎస్పీ బాలు చిరస్మరణీయుడు

చీమకుర్తి: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడని ప్రముఖ సంగీత విద్వాంసులు మాదవపెద్ది సురేష్ పేర్కొన్నారు. బాలు విగ్రహాన్ని గురువారం రాత్రి చీమకుర్తిలో ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. చీమకుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవపెద్ది సురేష్ మాట్లాడుతూ ఎస్పీ విగ్రహాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు మాధవరావును అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆహా.. ఇనుమేశారు



- పాత చేతి పంపుల సామగ్రి మాయం
- ఇనుప సామగ్రి అమ్ముకున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది
- వేలం వేయకుండానే సొమ్ము చేసుకున్న వైనం

చీరాల టౌన్: ప్రభుత్వ అధికారులు, సిబ్బందే ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. చిన్న పనుల్లో కూడా కక్కుర్తి పడుతూ చేతివాటం ప్రదర్శించడంపై సామాన్యులు కూడా ఏవగించుకుంటున్నారు.

గ్రామాల్లో చేతిపంపులు మరమ్మతులకు గురైతే వాటి స్థానంలో కొత్తవి వేసి పాత చేతి పంపు సామగ్రిని ఎంపీడీఓ కార్యాలయానికి చేర్చుతారు. పాత ఇనుము, పనికి రాని పంపు సామాన్లకు బహిరంగ వేలం నిర్వహించి వచ్చిన నగదును ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తారు. కానీ చీరాల్లో మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఒప్పంద ఉద్యోగులు గతంలో పనిచేసిన ముఖ్య అధికారి అండతో బహిరంగ వేలం వేయకుండా సామగ్రి అమ్మి డబ్బు తమ జేబుల్లోకి వేసుకున్నారు. గడిచిన మూడేళ్లలో ఒక్కసారి కూడా వేలం వేయకుండా సుమారు 5 టన్నుల పాత ఇనుం స్వాహా చేశారు.

16 గ్రామాల్లో..

వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు మండల పరిషత్ నిధుల నుంచి ఏడాది ఒకసారి చేతిపంపుల మరమ్మతుల కోసం నిధులు కేటాయింపులకు తీర్మానం చేస్తారు. చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీలు, 16 గ్రామాల్లో మొత్తం 700 చేతిపంపులున్నాయి. వీటిలో షాలో బోర్లు 250, చిన్న చేతి పంపులు 450 ఉన్నాయి. అయితే పంపు సామగ్రి కొనుగోలు చేయాలంటే టెండర్ పిలిచి తక్కువకు కోట్ చేసిన వారికి కేటాయించాలి. కానీ చీరాల మండల పరిషత్‌లో ఎలాంటి టెండర్లు పిలవడం లేదు. తమకు ఎవరైతే ఎక్కువగా ఆదాయాన్ని సమకూరుస్తారో వారికే టెండర్లు ఖరారు చేస్తున్నారనే విమర్శలున్నాయి. కాగా ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది.. చేతిపంపుల మరమ్మతులకు ఏడాదికి రూ.4 లక్షలు ఖర్చులు చేస్తున్నామని చూపుతూ.. కొనుగోళ్లు మాత్రం రూ.2 లక్షల్లోపే చేస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారనే విమర్శలు మెండుగా వినిపిస్తున్నాయి.

పాత పంపులు ఎక్కడ ?

గ్రామాల్లో మరమ్మతులకు గురై పనికిరాకుండా ఉన్న పంపులను ఎంపీడీవో కార్యాలయానికి తరలించి వాటికి బహిరంగ వేలం లేదా మధ్యవర్తి ద్వారా అమ్మకాలు చేసి వచ్చిన నగదును ట్రెజరీలో జమ చేయాలి. ఆయా నివేదికలను జెడ్పీ కార్యాలయానికి అందించాలి. కానీ చీరాల మండలంలో మాత్రం మొక్కుబడిగా కూడా ఈ ఆదేశాలు జరగడం లేదు. గతంలో పనిచేసిన అధికారులు కార్యాలయంలో కీలకంగా ఉన్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది సహాయంతో వీటిని అమ్మకాలు చేసుకుని ప్రభుత్వ ఆదాయాన్ని సొంతానికి వినియోగించున్నారు.

> **చర్యలు తప్పవు**
>
> మండలంలోని గ్రామాల్లో చేతిపంపుల మరమ్మతులకు కేటాయించిన నిధుల్లో అక్రమాలు జరిగాయన్న విషయం నాకు తెలియదు. అలానే పాత, పనికిరాని పంపు సామగ్రికి వేలం నిర్వహించాలి. ఈ ఏడాది సామగ్రి కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. గతంలో గ్రామాల నుంచి తీసుకువచ్చిన పాత సామగ్రికి వేలం వేశారో లేదో తెలుసుకుంటా. అక్రమాల్లో తమ సిబ్బంది పాత్ర ఉందని రుజువైతే చర్యలు తప్పవు.
>
> – శివసుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ

పెన్షనర్లకు తీరని నష్టం


విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు

ఇంకొల్లు(చినగంజాం): కేంద్ర ప్రభుత్వం సివిల్ సర్వీస్ పెన్షన్ రూల్స్ 1972 ను సవరణ చేస్తూ ఆర్థిక బిల్లులతో కలిపి దొంగచాటుగా చట్టసవరణ తీసుకు వచ్చిందని వక్తలు అన్నారు. గురువారం జరిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఇంకొల్లు శాఖ కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు మాట్లాడారు. ఈ విషయమై గజిట్ పబ్లికేషన్ కూడా జరిగిందని దీని వలన రాబోయే రోజుల్లో పే రివిజన్ జరిగినప్పుడు సర్వీస్ ఉన్న వారికి మాత్రమే పే రివిజన్ జరుగుతుందన్నారు. ఇది విశ్రాంత ఉద్యోగులకు వర్తించదని తెలిపారు. తక్షణం ఆ చట్టం అమలును నిలిపి వేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పే రివిజన్ చేసేటప్పుడు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులకు కూడా అమలు చేసే వారని, ఈ చట్టం వలన ఆ వెసులు బాటు ఉండదని వివరించారు. సీనియర్ సభ్యులు పీవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి తగిరశ వీరాంజనేయులు, కార్యవర్గ సభ్యులు పోతిన సుబ్బారావు, కాకి జర్మియా, జయరాజ్, అమ్మనమంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం


అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ


బల్లికురవలో పంచాయతీ రాజ్ దినోత్సవం

పర్చూరు (చినగంజాం): ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని, గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించడం ద్వారా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఆయా గ్రామ పంచాయతీల్లో ఘనంగా నిర్వహించారు. పర్చూరు సర్పంచ్ మల్లా అంజమ్మ, ఎంఈఓ 2 వెంకటరామయ్య, ఏపీఓ రమేష్, సీనియర్ అసిస్టెంట్ పి. నారాయణరావు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల టౌన్: గ్రామ పంచాయతీలు అభివృద్ధి సాధించాలంటే పంచాయతీ పాలకులు, అధికారులు కలిసి సమన్వయంగా పనిచేస్తేనే అభివృద్ధి తథ్యమని ఎంపీడీఓ శివసుబ్రహ్మణ్యం అన్నారు. పంచాయతీ రాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలానే వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

బల్లికురవ: పంచాయతీ రాజ్ శాఖ ఆధీనంలో ఉన్న పలు చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎంపీడీఓ కుసుమ కుమారి కోరారు. గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక పరిషత్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతిపిత మహాత్మాగాంధీ, భారతరాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డిప్యూటీ సీడీపీఓ దాసరి సుమతి, ఏపీఓ రమాదేవి, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పొదుపు గ్రూపులు అభివృద్ధి చెందాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా కృషి చేయాలని ఐకేపీ పథకం ఏపీఎం మధుసూదనరావు సూచించారు. గురువారం మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో ఐకేపీ మండల సమాఖ్య ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల ఏపీఎంలు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వీవోఏలు పనితీరు మార్చుకుని చక్కగా పనిచేయాలన్నారు. గ్రూపుల వివరాలు ఆర్థిక ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రూపు తీసుకున్న రుణాలను కేవలం స్వయం సహకారం పెంపొందించుకునే సంస్థలను ఏర్పాటు చేసుకుని అభివృద్ధి సాధించాలన్నారు. గ్రామ సంఘాలు ప్రతినెలా సమావేశాలను నిర్వహించుకొని సంఘం అభివృద్ధికి లీడర్లు కృషి చేయాలని కోరారు. మండల సమాఖ్య ప్రతినిధులు, సీసీ, సీవీలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఊయల


మాట్లాడుతున్న సీడీపీఓ సుభద్ర, వైద్యాధికారులు

పర్చూరు(చినగంజాం): బిడ్డ వద్దనుకుంటే రోడ్డు పక్కన వేయకుండా కమ్యూనిటీ హెల్త్ క్లినిక్‌లోని ఊయల్లో వేయాలని పర్చూరు అంగన్‌వాడీ సీడీపీఓ జి. సుభద్ర సూచించారు. మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఊయల కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అభాగ్యులైన శిశువులను, అమ్మఒడి వద్దు అనుకుంటున్న శిశువులను, రోడ్డు పక్కన పడ వేయవద్దని కోరారు. ఒకవేళ ఎవరైనా చూసినా వెంటనే తెచ్చి కమ్యూనిటీ హెల్త్ క్లినిక్‌లోని ఊయలలో ఉంచి తమకు అందజేయాలని ఆమె తెలిపారు. డాక్టర్ ఎస్. సత్యదీప్తి, డాక్టర్ జె. సౌమ్య, హెడ్ నర్స్, సూపర్ వైజర్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ పూజలు


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి


కారంచేడులో గంగమ్మతల్లి బొల్లావుల ఊరేగింపులో యువకులు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి గంగమ్మ తల్లి 28వ తిరునాళ్లను పురస్కరించుకొని గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి తలంట్లు చేశారు. మధ్యాహ్నం నుంచి గ్రామంలో బొల్లావుల ఊరేగింపును పెద్ద ఎత్తున నిర్వహించారు. సాయంత్రం రాజు, ప్రధాని బియ్యం కోల, బద్దె గొర్రె నిర్వహించారు. గ్రామంలోని యువకులు పెద్ద ఎత్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని వీరతాళ్లతో నృత్యాలు చేశారు. గ్రామ ఆడపడుచులు అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు.

దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

కారంచేడు: ప్రతి ఒక్కరూ తమ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చీరాలకు చెందిన రాఫా దంద వైద్యశాల రూట్ కెనాల్ స్పెషలిస్టులు డాక్టర్ కె. మధుకిరణ్, డాక్టర్ పి. ప్రశాంతి అన్నారు. గురువారం మండల కేంద్రమైన కారంచేడు చినవంతెన సెంటర్ ఎన్‌టీఆర్ కుటీరంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 125 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంతాలను శుభ్రంగా ఉంచుకోకపోవడం వలన కలిగే నష్టాలను వివరించారు. దంతాలు మన శరీరంలో కీలకంగా ఉంటాయని వివరించారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం రెండు సార్లు శుభ్రం చేసుకోవాలన్నారు.


కారంచేడులో దంతవైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ మధుకిరణ్

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

అద్దంకి: మండల వెలుగు కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సమావేశాని నిర్వహించారు. ఈ సమావేశం వెలుగు ఏపీఎం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని 42 గ్రామ సంఘాలకు గాను 31 గ్రామ సంఘాల అధ్యక్షులు హాజరయ్యారు. పి. ఫోర్ విధానంలో పేద, నిరుపేద కుటుంబాలను ఎలా అభివృద్ధిలోకి తీసుకురావాలి. బంగారు కుటుంబాలు, మార్గదర్శులు అంటే ఎవరు అనే విషయాలను వివరించారు. ప్రతి ఐదు బంగారు కుటుంబాలకు ఒక మార్గదర్శిని ఎంపిక చేసి ఆ ఐదు కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించే విధంగా చూడాలని ఏపీఎం చెప్పారు.

నూతనపాలక వర్గం ఎన్నిక..

ఈ సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలిగా మణికేశ్వరానికి చెందిన షేక్ కరిమూన్, ఉపాధ్యక్షురాలిగా ధర్మవరానికి చెందిన పచ్చవ భారతి, కార్యదర్శిగా గోపాలపురానికి చెందిన రాపూరి దేవి, సహాయ కార్యదర్శిగా నాగులపాడుకు చెందిన కొప్పుల మాలతి, కోశాధికారిగా తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన వెంగలశెట్టి అంజమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఏపీఎంతో పాటు, సీసీలు, పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే పీ4 కార్యక్రమాలు


కారంచేడులో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో పేదరికాన్ని నిర్మూలించేలా ఏర్పాటు చేసిన ప్రణాళికలను బట్టి పీ4 సర్వేను నిర్వహించామని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివిధ మండల స్థాయి నాయకులతో మాట్లాడారు. మండలంలోని 14 గ్రామాల పరిధిలో 1991 కుటుంబాలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమం ద్వారా నిరుపేదలకు జీవనోపాధి కలిగించడం, వారి భవిష్యత్ అభివృద్ధిపై వివిధ రకాల ప్రణాళికలతో అవగాహన కల్పించడం చేయాల్సి ఉందన్నారు. తహసీల్దారు జి. నాగరాజు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

చీరాల అర్బన్: చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చీరాల రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైల్వేస్టేషన్ ఎస్ఎస్ ఎన్.సింగయ్య పాల్గొన్నారు. వేసవిలో పాదచారులు, ప్రయాణికులు దాహం తీర్చుకునేందుకు చీరాల రోటరీ క్లబ్ ముందుకు రావడం అభినందనీయమని సీఐ ఎస్. సుబ్బారావు అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చందలూరి బాలవెంకటేశ్వరరావు, నక్కల సురేష్, పోలుదాసు రామకృష్ణ, వంగర పూర్ణచంద్రరావు, మామిడాల శ్రీనివాసరావు, దోగుపర్తి వెంకట సురేష్, చీరాల కృష్ణమూర్తి, జీవై ప్రసాద్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంజమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొన్ని శాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ కు సంబంధించి పల్లెపండగలో భాగంగా రహదారులు నిర్మించారన్నారు. కొన్ని గ్రామాల్లో సైడు కాలువలు నిర్మించాల్సి ఉందని పీఆర్ ఏఈ వీరాంజనేయులు తెలిపారు. పోషణ్ పక్వాడా ద్వారా పోషకహారంపై పక్షోత్సవాలు నిర్వహించి అవగాహన కల్పించినట్లు అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఉషారాణి తెలిపారు. పాఠశాలలో వందశాతం ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎంఈవో రవి చెప్పారు. పదో తరగతి పరీక్ష పలితాల్లో మంచి మార్కులు సాధించిన వారికి మండల పరిషత్ ద్వారా ప్రోత్సహక బహుమతులు అందజేస్తామని ఏవో దక్షిణామూర్తి తెలిపారు. తదుపరి కొన్నిశాఖల వారీగా సమీక్షించారు. అనంతరం మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి మృతికి సంతాపం తెలిపారు. ఎంపీడీవో వై మహాలక్ష్మి మాట్లాడుతూ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించరాదన్నారు.

గోశాలకు తవుడు వితరణ


గోశాలకు తవుడు బస్తాలు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో విశ్వభారతి రోడ్డులోని హరిహర గోశాలకు దామా జగదీష్ వారి కుమార్తె ధాత్రి శ్రీ పుట్టిన రోజు సందర్భంగా 8 తవుడు బస్తాలు, చెన్నుపల్లి అంజయ్య 2 బస్తాలు, చెన్నుపల్లి సుబ్బారావు 2 బస్తాలు మొత్తం తవుడు బస్తాలు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, డాక్టర్ దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, ఊటుకూరి రామకోటేశ్వరరావు, గాడేపల్లి దివాకరదత్తు, గోశాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.